
నారసింహుడి రథోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్


రథోత్సవంలో సాంప్రదాయ నృత్యాలు చేస్తున్న మహిళలు


రంగారెడ్డి గూడ వేడుకకు హాజరైన భక్తులు


రంగారెడ్డిగూడలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మార్మోగిన గోవింద నామస్మరణ


జడ్చర్లలో పూజలు చేస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో సింహగిరి క్షేత్రంలో వెలిసిన లక్ష్మీనృసింహస్వామి 37వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాతం, చతుస్థానార్చనలు, మూలమంత్ర హవనములు, పూర్ణాహుతి, తదితర పూజలు నిర్వహించారు. చంద్రప్రభ వాహన సేవలో స్వామి వారిని ఊరేగించారు. శాత్తుమొర, తీర్థప్రసాదాల వితరణ అనంతరం సాయంత్రం 5.30 గంటల నుంచి పలు విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారి రథోత్సవం వైభవోపేతంగా సాగింది. భజంత్రీలు, మంగళ వాయిద్యాలు, పురోహితుల వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన వేడుకల్లో ప్రజలు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గోవింద నామస్మరణలతో సింహగిరి మారుమ్రోగిపోయింది. బ్రహ్మోత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సుప్రసిద్ధ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మూడోరోజు కొనసాగాయి. బాదేపల్లి భక్తబృందంచే భజన, జడ్చర్ల మారుతి భజనమండలి, కావేరమ్మపేట వెంకటేశ్వర భక్తమండలి చిరుతల భజనలు నిర్వహించారు.

రాజాపూర్: రంగారెడ్డిగూడలో శ్రీలక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఆలయ ధర్మకర్త జనంపల్లి దిలీప్ రెడ్డి, శశికళారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టువస్త్రాలు, వడిబియ్యం సమర్పించారు. కల్యాణోత్సవం వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ పూర్వీకుల కాలం నుంచి లక్ష్మీ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేవారని, తిరిగి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయం భూములను కూడా కాపాడుతూ వచ్చామని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్‌లు జనంపల్లి శశికళారెడ్డి, దుష్యంత్‌రెడ్డి, నాయకులు నరహరి, శ్రీనునాయక్, రాములుగౌడ్, శివప్రసాద్, లక్ష్మీనారాయణగౌడ్, విక్రంరెడ్డి, నరహరి తదితరులు పాల్గొన్నారు. **గండేడ్:** జంగంరెడ్డిపల్లి, వెన్నాచేడ్ గ్రామాల్లో లక్ష్మీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం రెండు చోట్ల వివిధ కార్యక్రమాలు చేపట్టారు. కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. వేడుకలకు గండేడ్, రంగారెడ్డిపల్లి, అంచన్‌పల్లి, కొంరెడ్డిపల్లి, చెన్నాయపల్లి, లింగాయిపల్లి, జక్లపల్లి, జిన్నారం, జానంపల్లి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప జంగంరెడ్డిపల్లి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా పార్టీల నాయకులు జితేందర్‌రెడ్డి, కృష్ణ, ప్రభునాయక్, మాజీ సర్పంచులు పుల్లారెడ్డి, హన్మంతు ఉన్నారు.


వెన్నాచేడ్‌లో వేడుకలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణానికి గంట కుటుంబ సభ్యులు రూ.85వేలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు గంట రాజశ్రీ, రఘువీందర్, గంట వాసంతి, రవీందర్ శనివారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాంచంద్రయ్య తదితరులు వారిని సత్కరించారు. అదేవిధంగా రాజశ్రీ తండ్రి, తిరుపతికి చెందిన ఓరుగంటి రామకృష్ణ రూ.10వేలను అందజేశారు. భాస్కర్‌గౌడ్, శెట్టిశేఖర్, కొండయ్య, రాజేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా హనుమంతు



అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన మునగల హనుమంతును కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమించారు. డీసీసీ కార్యాలయంలో శనివారం ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హనుమంతును అభినందించారు. రాజశేఖర్‌రెడ్డి, ఖాజామైనోద్దీన్, నిరంజన్, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, కస్తూర్బా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులను శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ న్యాయవాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పదిలో ఫస్ట్ ర్యాంకు సాధించిన వారికి రూ.10వేలు, రెండో ర్యాంకు పొందిన వారికి రూ.5వేలు బహుమతి అందజేస్తామన్నారు. ఎంపీటీసీ గౌస్, హెచ్ఎం సరస్వతి, ప్రత్యేకాధికారిణి కవిత, న్యాయవాదులు బిల్‌గేట్స్, రామ్, కిరణ్, వెంకటయ్య, రూతమ్మ పాల్గొన్నారు.

జాబ్‌కార్డ్ ఉన్నవారందరికీ పనికల్పిస్తాం

మహబూబ్‌నగర్ రూరల్: జాబ్ కార్డు ఉన్న ప్రతికూలీకి ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ కరుణశ్రీ పేర్కొన్నారు. శనివారం బొక్కలోనిపల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల వద్దకు వెళ్లి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా వారానికి మూడు రోజుల పాటు నీళ్లు అందించాలని సూచించారు.

గురు రవిదాస్ జయంతి

మహబూబ్‌నగర్ రూరల్: బహుజన మహనీయుల శోభయాత్ర ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు జై భీమ్ చౌరస్తాలో సాధు సంతు గురు రవిదాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు పాతూరి రమేష్, సింగిరెడ్డి పరమేశ్వర్, బాలరాజు, వెంకటస్వామి, బాలన్న, ఎర్ర నర్సిములు, రాజగాని అశోక్, బొర్ర సురేష్, పోలే బాలయ్య, దినేష్ పాల్గొన్నారు.

చిన్నారెడ్డి సేవలకు గుర్తింపు

నవాబుపేట: కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించటంతో మండల నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఆయన సేవలకు గుర్తింపు లభించిందన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారావు, ప్రధానకార్యదర్శి బంగ్లరవి, పీసీసీ అధికారప్రతినిధి జహీర్ అక్తర్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య ఉండొద్దు


నవాబుపేటలో సమీక్షలో మాట్లాడుతున్న అధికారులు


అడ్డాకులలో సమీక్ష చేస్తున్న డీఎఫ్ఓ సత్యనారాయణ

అడ్డాకుల: వేసవికాలం మొదలవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీశాఖ, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో తాగునీటిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా వేసవికాలం మొదలైనందున మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే ఇబ్బంది రాకుండా పాత బోరుబావులను ముందే బాగు చేయించాలని సూచించారు. కరెంటు మోటార్లు, తాగునీటి పైప్ లైన్లకు మరమ్మతు చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఘన్సీరాం, ఎంపీడీఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ శివప్రసాద్, ఎంపీఓ విజయకుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నవాబుపేట: తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు స్పెషల్ అధికారి పద్మ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో సమస్యలు గుర్తించాలని ఆమె సూచించారు. సమస్యలను ముందుగా గుర్తించి మండల అధికారుల ద్వారా సాధ్యాసాధ్యాలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని ఆమె వివరించారు. వీర్‌శెట్టిపల్లి, దేపల్లి, లోకిరేవు, పోమాల్ తదితర గ్రామాల సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలని ఆమె సంబంధిత అధికారులకు వివరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, ఏపీఓ జ్యోతీ తదితరులు ఉన్నారు.

మండల స్పెషల్ అధికారిగా పద్మ

ఇప్పటి వరకు మండల స్పెషల్ అధికారిగా ఉన్న సుధాకర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కోఆపరేటివ్ సీఈఓ పద్మ శనివారం బాధ్యతలు తీసుకున్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

చిన్నచింతకుంట: గ్రామాలభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం చిన్నచింతకుంట, కొకుంట్ల మండలంలోని ఇస్రంపల్లి, రేకులంపల్లి, పేరూరు, ముచ్చింతల, అప్పంపల్లి, దాసర్‌పల్లి, తిరుమలపురం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అప్పంపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు మణివర్ధన్‌రెడ్డిని కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, కొకుంట్ల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.


తిరుమలాపురంలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

స్ఫూర్తిప్రదాత దయానంద సరస్వతి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆధునిక భారత దేశ నిర్మాతలలో స్వామి దయానంద సరస్వతి ప్రముఖులని.. స్ఫూర్తిప్రదాత అని రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో సుభాష్ ఆర్య ఆధ్వర్యంలో శనివారం దయానందుడి ద్విశతాబ్ది జయంతి నిర్వహించగా.. శివకుమార్ పాల్గొని ప్రసంగించారు. రెడ్డిసేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, జి.బాలయ్య, సాయిలుగౌడ్, నస్కంటి నాగభూషణం, ఎ.రాజసింహుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సుభాష ఆర్య రచించిన 'సత్యార్థ ప్రకాశం సత్యోపదేశములు' గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్య ప్రతినిధి కొసరాజు రవీంద్రబాబు గ్రంథ సమీక్ష చేశారు.


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న శివకుమార్ తదితరులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీపీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, బెనహర్, యుగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ మార్టిన్‌పాల్ మునుగాల్‌సెట్టి నర్వస్ సిస్టంపై రచించిన న్యూరో పుస్తకాన్ని శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నూతన చైర్మన్‌గా నియామకమైన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీపీపీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, మహబూబ్‌నగర్ పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్‌అలీ, పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షులు గులాం జహీర్, అసెంబ్లీ కోఆర్డినేటర్ షాఫైసల్, మూసా చావుష్, ఫక్రుద్దీన్, ఖాదర్, జాహెద్, మహ్మద్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ ఉపసంఘం హర్షణీయం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం డిప్యూటీ సీఎం రాజనర్సింహ ఆధ్వర్యంలో 317 జీఓలో ఉపాధ్యాయుల సమస్యలను తొలగించేందుకు మంత్రి వర్గ ఉపసంఘం వేయడం హర్షణీయమని టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, రమాకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపసంఘం వేయడం హర్షించదగ్గ విషయమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాంరెడ్డిలు పేర్కొన్నారు.

నేడు నాటక ప్రదర్శన

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం రాత్రి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కళా నిలయం నిర్వాహకులు, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ తెలిపారు. మోహన్‌రాజు, ఆలయ కమిటీ సహకారంతో శ్రీకృష్ణరాయభారంలోని పడకసీను, కౌరవసభ ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే తడకమళ్ల రాంచందర్ రావు రచించిన మైరావణ పద్యనాటకం ఉంటుందన్నారు. నాటక ప్రదర్శన తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిన్నచింతకుంట: పర్దిపురంలో రైతులు మోహన్ రెడ్డి, మల్లప్ప శుక్రవారం విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి శనివారం మోహన్ రెడ్డి, మల్లప్ప మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు


మిడ్జిల్‌లో..


బాలానగర్‌లో..

మిడ్జిల్: ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. క్లస్టర్ హెచ్ఎం సరస్వతి, ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాసులు, వసుంధర, స్వరుపారాణి, ప్రభావతి, రాజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని అపెక్స్ పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. 46 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కరస్పాండెంట్ శివజ్యోతి, ప్రిన్సిపాల్ శేఖరయ్య, పర్వేజ్ అన్సారీ, భీమలింగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలంలోని గాయత్రి ప్రైవేటు స్కూల్‌లో వేడుక నిర్వహించారు. కరస్పాండెంట్ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో వేడుక ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శ్రీ నారాయణ, ఉపాధ్యాయులు సుజాతాదేవి, రాధిక, యాదమ్మ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దు

జడ్చర్ల టౌన్: సీఎం ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రతి ఉద్యోగి బాధ్యత తీసుకోవాలని ఎస్ఈ రమేష్ ఆదేశించారు. శనివారం స్థానికంగా డీఈ, ఏడీఈ, ఏఈ, లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్, ఇతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్చి రెండో వారం నుంచి తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటించాలన్నారు. నిరంతర విద్యుత్‌లో ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సరఫరాలో లోటుపాట్లు రాకుండా ఉండేందుకు సిబ్బందికి ఆదేశాలు జారి చేసినట్లు విలేకరులకు తెలియజేశారు. పలు సూచనలిచ్చామన్నారు. డీఈ కృష్ణమూర్తి, ఏడీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఈ రమేష్


మోటార్‌లైన్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 42వ వార్డు పరిధిలోని మోటార్ లైన్ ప్రాంతాన్ని శనివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్ పరిశీలించారు. కాగా వివిధ దుకాణాల వారు సీసీరోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాలని, రాత్రివేళ వీధి దీపాలు వెలిగేలా చూడాలని, ఎప్పటికప్పుడు చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగించాలంటూ వారి దృష్టికి తీసుకొచ్చారు. కాగా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ వైష్ణవి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని జీనియస్ మైండ్ పాఠశాలలో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కరస్పాండెంట్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ 100 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు సరికాదు


మాట్లాడుతున్న పి.శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు: బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్న క్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విహారయాత్ర అనడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజం కానీ వ్యక్తిగత విమర్శలు ఉండరాదన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని అభివృద్ధి చేసి చూపించాలని, పద్ధతి మార్చుకోకపోతే రెట్టింపు విమర్శలు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. కోయిల్‌సాగర్ కింద పంట పొలాలకు 15రోజులకు ఓసారి నీళ్లు వదులుతున్నారన్నారు. మీ నాయకుడు టీడీపీలో ప్రస్థానం మొదలుపెట్టి..కాంగ్రెస్‌లోకి ఎందుకు వచ్చాడని ప్రశ్నించారు. పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి కోసం కేంద్రం రూ.వంద కోట్లు కేటాయించింది నిజం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, అంజయ్య, నారాయణ యాదవ్, ప్రవీణ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షలు ఈనెల 28 నుంచి విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా సజావుగా నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డీఐఈఓ శ్రీధర్‌సుమన్‌కు వినతిపత్రం అందజేశారు. పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్‌లు, లైట్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించాలని, జిల్లా కేంద్రానికి చాలా మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుండి పరీక్షలు రాసేందుకు వస్తుంటారని, వారు పరీక్షకు 5నిమిషాలు ఆలస్యమైనా అనుమతించాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రశాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత

- పిల్లలను అపహరించే వ్యక్తిగా భావించిన లాల్‌కోట స్థానికులు
- వాట్సాప్ వదంతులు నమ్మవద్దన్న ఎస్ఐ


శ్రీనునాయక్‌తో పోలీసులు

చిన్నచింతకుంట: అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శేఖర్ సూచించారు. శనివారం లాల్‌కోట చౌరస్తాలో మతిస్థిమితం లేని యువకుడు కనిపించడంతో.. పిల్లలను ఎత్తుకెళ్లే వ్యక్తిగా భావించి స్థానికులు అతడిని పట్టుకొని తమకు అప్పగించినట్లు వివరించారు. కాగా పోలీసులు సదరు వ్యక్తి వివరాలు సేకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాట్సప్‌లో వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దన్నారు. లాల్‌కోట చౌరస్తాలో పిల్లలను అపహరించే వ్యక్తిగా పరిగణించిన యువకుడు వంకుడోత్ శ్రీనునాయక్ దేవరకొండ మండలానికి చెందిన వ్యక్తిగా నిర్ధారణ అయిందన్నారు. శ్రీనునాయక్ కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చి తిరుగుతూ ఇక్కడికి వచ్చినట్లు వివరించారు.